بِسۡمِ اللّٰہِ الرَّحۡمٰنِ الرَّحِیۡمِ نَحۡمَدُہٗ وَنُصَلِّیۡ عَلٰی رَسُوۡلِہِ الۡکَرِیۡمِ وَعَلٰی عَبۡدِہِ الۡمَسِیۡحِ الۡمَوۡعُوۡد

وَلَقَدۡ نَصَرَکُمُ اللّٰہُ بِبَدۡرٍ وَّاَنۡتُمۡ اَذِلَّۃٌ

సంపుటి 1

సంచిక 12

వార్షిక చందా 300/-రూ॥

వార పత్రిక

# బదర్

ఖాదియాన్

The Weekly BADAR Qadian TELUGU

సంపాదకులు: సయ్యద్ రసూల్ నియాజ్

ఉపసంపాదకులు: ముహమ్మద్ అక్బర్

www.akhbarbadrqadian.in

17 షభాన్ 1437 హి.ఖ, 26 హిజ్రత్ 1395 హి.శ, 26 మే 2016

## అహ్మదియ్యా వార్తలు

సయ్యద్నా హజ్రత్ అమీరుల్ మువినీన్ అయ్యదహు తాలా బినస్రిహిల్ అజీజ్ అల్లాహ్ తాలా దయతో క్షేమంగానే యున్నారు. అల్‌హందులిల్లాహ్.

జమాఅత్ సభ్యులు హుజూరె అన్వర్ ఆయురారోగ్యము, ఉన్నత ఆశయాల సాధన, ప్రత్యేక రక్షణ కొరకు దుఆలు కొనసాగించ గలరు. అల్లాహ్ తాలా అనుక్షణం హుజూర్ ను రక్షించుచు సహాయ, సహకారాము అందించుగాక! (ఆమీన్)

**నా స్థితి ఎట్లున్నదనగా మరణింతునని భావించినప్పుడు ఉపవాసమును వీడుతాను. కాని ఉపవాసమును వీడుటకు మనసు ఒప్పుకోదు. ఇవి శుభకరమైన రోజులు. అల్లాహ్ తఆలా అనుగ్రహము, కరుణ అవతరించు రోజులు.**

**ఉపదేశములు : హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం**

## దర్సుల్ ఖుర్‌ఆన్

یٰۤاَیُّہَا الَّذِیۡنَ اٰمَنُوۡا کُتِبَ عَلَیۡکُمُ الصِّیَامُ کَمَا کُتِبَ عَلَی الَّذِیۡنَ مِنۡ قَبۡلِکُمۡ لَعَلَّکُمۡ تَتَّقُوۡنَ ○ اَیَّامًا مَّعۡدُوۡدٰتٍ ؕ فَمَنۡ کَانَ مِنۡکُمۡ مَّرِیۡضًا اَوۡ عَلٰی سَفَرٍ فَعِدَّۃٌ مِّنۡ اَیَّامٍ اُخَرَ ؕ وَعَلَی الَّذِیۡنَ یُطِیۡقُوۡنَہٗ فِدۡیَۃٌ طَعَامُ مِسۡکِیۡنٍ ؕ فَمَنۡ تَطَوَّعَ خَیۡرًا فَہُوَ خَیۡرٌ لَّہٗ ؕ وَاَنۡ تَصُوۡمُوۡا خَیۡرٌ لَّکُمۡ اِنۡ کُنۡتُمۡ تَعۡلَمُوۡنَ ○

అనువాదము:– ఓ విశ్వాసులారా! మీలో దైవ భీతి కల్గించు ఉద్దేశముతో మీ కన్న పూర్వమున్న వారికి విధించినట్లే మీకును ఉపవాస నియమము విధింపబడి యున్నది.

(ఈ ఉపవాస నియమము) నిశ్చిత దినములకే పరిమితమై యున్నది, కాని మీలో ఎవరైనను అనారోగ్యముగా ఉన్నచో, లేదా ప్రయాణము నందు యున్నచో మీరు ఆయా దినములలో ఉపవాస నియమమును పాటించకుండా మరెప్పుడైనను ఉపవాసము పాటించి ఆ నియమ సంఖ్యను పూర్తి చేసుకోవలెను, మరెవరికైనను ఉపవాసము పాటించు స్థితి లేనిచో వారికి ఒక పేద వానికి భోజనము పెట్టగలిగిన స్థోమత యున్నచో భోజనము పెట్టుట కర్తవ్యము. బుద్ధి పూర్వకముగా విధేయుడై ఎవడైనను సత్కార్యము చేసినచో అతనికి అది మంచిదే. ఇది తెలిసి ఉపవాసము పాటించినచో నీకు అది చాలా శ్రేయస్కరము. (అల్‌బఖరహ్: 184,185)

## దర్సుల్ హదీస్

عَنۡ اَبِیۡ ہُرَیۡرَۃَ رَضِیَ اللّٰہُ عَنۡہُ قَالَ : قَالَ رَسُوۡلُ اللّٰہِ صَلَّی اللّٰہُ عَلَیۡہِ وَسَلَّمَ : قَالَ اللّٰہُ عَزَّ وَ جَلَّ : کُلُّ عَمَلِ بۡنِ اٰدَمَ لَہٗ اِلَّا الصِّیَامَ فَاِنَّہٗ لِیۡ وَاَنَا اَجۡزِیۡ بِہٖ ۔ وَالصِّیَامُ جُنَّۃٌ فَاِذَا کَانَ یَوۡمُ صَوۡمِ اَحَدِکُمۡ فَلَا یَرۡفُثۡ وَلَا یَصۡخَبۡ فَاِنۡ سَابَّہٗ اَحَدٌ اَوۡ قَاتَلَہٗ فَلۡیَقُلۡ : اِنِّیۡ صَآئِمٌ ۔ وَالَّذِیۡ نَفۡسُ مُحَمَّدٍ بِیَدِہٖ لَخُلُوۡفُ فَمِ الصَّآئِمِ اَطۡیَبُ عِنۡدَ اللّٰہِ مِنۡ رِیۡحِ الۡمِسۡکِ ۔ لِلصَّآئِمِ فَرۡحَتَانِ یَفۡرَحُہُمَا ، اِذَا اَفۡطَرَ فَرِحَ ، وَاِذَا لَقِیَ رَبَّہٗ فَرِحَ بِصَوۡمِہٖ ۔

హజ్రత్ అబూహురైర రజియల్లాహు తఆలా అన్హు ఉల్లేఖనం ప్రకారం ఆo హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఈ విధముగా తెలిపిరి, అల్లాహ్ తాలా ఇలా తెలిపెను, “మానవుని పనులన్ని అతని కోసమే, కాని ఈ ఉపవాస దీక్ష మాత్రము నా కొరకు. అందుకు ప్రతిఫలం స్వయంగా నేనే,” అనగా అతని ఈ సత్కార్యము వలన నా దర్శనం అతనికి కలుగుతుంది. అల్లాహ్ తాలా మరల ఇలా తెలిపెను, “ఉపవాసము ఒక డాలు. కావున మీలో ఎవరైనా ఉపవాసము పాటించుచున్నచో వారు దుర్భాషలాడ కూడదు, ఎలాంటి అల్లకల్లోల పరిస్థితులను సృష్టించకూడదు. ఎవరైనా అతనితో దుర్భాషలాడినచో, లేదా తగాద, జగడమాడినచో అతను కేవలం నేను ఉపవాసమును పాటించుచున్నాను అని మాత్రమే సమాధానం ఇవ్వవలెను. ఎవరి అర చేతిలో ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం) ప్రాణము గలదో అతని సాక్షిగా తెలుపుచున్నాను, ఉపవాస ముండు వారి నోటి వాసన అల్లాహ్ దృష్టిలో కస్తూరి వాసనను మించి సువాసన గలది, విలువైనది. ఎందుకనగా అతడు ఈ స్థితిని కేవలం అల్లాహ్ తాలా కొరకే ఏర్పర్చుకున్నాడు. ఉపవాసముండు వారికి రెండు ఆనందములు గలవు. ఒకటి అతడు ఉపవాసమును విడుచునప్పుడు, రెండవది అతనికి ఉపవాసముల వలన దైవదర్శనం కల్గినప్పుడు.” (బుఖారి ఉతాబుస్సౌమ్ బాబ్ హల్ యఖూలు ఇన్నీ సాయిమున్ ఇజా షతిమ)

## హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) ప్రవచనములు

‘రమ్‌జ్ అనగా సూర్యుని ప్రతాపము. రమజాన్ మాసంలో మానవుడు తిను త్రాగుట మరియు శారీరక సు:ఖములన్నింటిపై సహనమును పాటించును. అల్లాహ్ తాలా ఆదేశాలను పాటించుటకై తనలో ఒక ఉద్రేకమును కల్గించుకొనును, ఈ విధముగా శారీరక, ఆధ్యాత్మిక ఉద్రేకములను, ఉత్తేజములు కలసి “రమజాన్” గా రూపోందినది. వేసవి కాలంలో ప్రారంభమైనందునే దీనికి “రమజాన్” అని నామకరణం చేసినట్లు నిఘంటువులు తెలిపెదను. నా దృష్టిలో ఇది సరైనది కాదు. ఎందుకనగా అరబ్బుల దృష్ట్యా ఇందులో ఎలాంటి ప్రాధాన్యత లేదు. ఆధ్యాత్మిక “రమ్‌జ్” అనగా ఆత్మపరమైన ఉద్రేకములను, ఉత్తేజములను, ఉత్సాహములను కల్గింప జేసుకోవడమే. ఏ సూర్య రశ్మి వలన రాళ్ళు వేడెక్కునో దానిని కూడ “రమ్‌జ్” అని అందురు.”

(మల్ఫూజాత్, సంపుటి 1, పుట 136, ఎడిషన్ 2003, ఖాదియాన్)

“రమజాన్ మాసము పవిత్రమైన మాసము. దుఆల మాసము.”

ఇంకను ఇట్లనిరి. “నా స్థితి ఎట్లున్నదనగా మరణింతునని భావించినప్పుడు ఉపవాసమును వీడుతాను. కాని ఉపవాసమును వీడుటకు మనసు ఒప్పుకోదు. ఇవి శుభకరమైన రోజులు. అల్లాహ్ తఆలా అనుగ్రహము, కరుణ అవతరించు రోజులు.” (మల్ఫూజాత్, సంపుటి 1, పుట 439, ఎడిషన్ 2003, ఖాదియాన్)

జమీల్ అహ్మద్ నాసిర్, ప్రింటర్ పబ్లిషర్ గారు ఫజ్లె ఉమర్ ప్రింటింగ్ ప్రెస్ ఖాదియాన్‌లో ముద్రించి అఖ్బారె బదర్ ఖాదియాన్ కార్యాలయము నుండి ప్రచురించిరి. ప్రోప్రైటర్, నిగ్రాన్ బదర్ బోర్డ్ ఖాదియాన్

**సంపాదకీయం :-**

(జూన్ 19, 2015 నాటి హుజూర్ గారి జుమా ప్రసంగం రంజాన్‌ను గూర్చి)

ఈ రోజు శుభప్రదమైన శుక్రవారము పవిత్ర రంజాన్ మాసములోని మొదటి ఉపవాసము. ఈ దినము అనంత శుభములతో ప్రారంభమైన పర్వదినము. శుభకరమైన జుమా దినపు ప్రాముఖ్యత గురించి ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం వార్త నందించినారు. వారి ఈ వార్త శాశ్వితమైనది. ఈ రోజున విశ్వాసి దేవుని వద్ద చేసిన ప్రార్థనలు ఆమోదింపబడునొక ఘడియ వచ్చును.

(సహీ బుఖారీ కితాబుల్ జుమ బాబ్ స్వలాత్ ఫీ యోమిల్ జుముఅహ్ హదీసు నెం. 935)

అనంతరం రంజాన్ గూర్చి ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లు సెలవిచ్చారు. 'రమ్‌జాన్ మాసము ప్రారంభమైనప్పుడు స్వర్గ ద్వారములు తెరువబడి, నరక ద్వారాలు మూసి వేయబడుతాయి.'

(సునన్ తిర్మిజీ కితాబుల్ సౌమ్ బాబ్ మా జాఅ ఫీ ఫజ్‌లీ షహరు రమజాన్ హదీసు నెం॥ 682)

ఈ మాసములో అల్లాహ్ తాలా కరుణ ప్రత్యేక ఉత్సాహంతో ఉండి, విశ్వాసులపై అల్లాహ్ కారుణ్య శుభముల, వరముల వర్షము కురిపిస్తుంది. కాని ఈ శుభములను ఆకర్షించుటకు ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం పలు షరతులను విధించినారు. అనగా ఈ రోజులలో వృధా మాటలు మాట్లాడకూడదు. అల్లరి, దుష్టత్వమునకు పాల్పడకూడదు, దూషణలు, జగడములకు దిగకూడదు. ప్రతి చెడుకు బదులుగా ఉపవాసి ఇట్లనవలెను. నేను ఉపవాసం పాటిస్తున్నాను.

(సహీ బుఖారీ కితాబల్ – సౌమ బాబ్ ఫజలుస్సౌమ్ హదీసు – నెం॥ 1894)

అల్లాహ్ తాలా కొరకు నేను ఈ దుష్టత్వ కార్యముల నుండి దూరముంటున్నాను. ఈ పరిస్థితి ఏర్పడినప్పుడే నిజమైన ఉపవాసమగును. మరియు అల్లాహ్ తాలా ఆదేశానుసారము మానవుడు తన జీవితమును గడుపుటకు ప్రయత్నించును.

రమజాన్ మాసపు ప్రాముఖ్యత ఏమిటి? ఎవరిపై ఉపవాసములు విధిగావింపబడినవి? ఎలా పాటించాలి? ఏ ఏ ఆంక్షలు కలవు? అల్లాహ్ తాలా దీనిని (అల్ బఖరహ్–187)

وَإِذَا سَأَلَكَ عِبَادِي عَنِّي فَإِنِّي قَرِيبٌ ۖ أُجِيبُ دَعْوَةَ الدَّاعِ إِذَا دَعَانِ ۖ
فَلْيَسْتَجِيبُوا لِي وَلْيُؤْمِنُوا بِي لَعَلَّهُمْ يَرْشُدُونَ

అనగా! నన్ను గూర్చి నా దాసులు నిన్ను ప్రశ్నించినప్పుడు నిశ్చయంగా నేను వారికి సమీపముగానే ఉన్నానని తెల్పుము. أُجِيبُ دَعْوَةَ الدَّاعِ إِذَا دَعَانِ నన్ను పిలుచు వాని ప్రార్థనలకు నేను సమాధానమిస్తాను. కావున వారు సన్మార్గము అవలంబించుటకు సావధానులై నా ఆదేశములను వినవలెను. నా యందు విశ్వాసముంచవలెను. రమజాన్ నెలలో వచ్చు జుమాల ప్రాధాన్యత రెట్టింపగును. పగలు, రాత్రులు కూడ దుఆలు ఆమోదించబడునవే. ఏ ఘడియలలో దుఆలు స్వీకరించబడుతాయొ తెలియదని అల్లాహ్ తెలిపెను. అందువల్ల పగలు, రాత్రి దుఆలలో గడుపుము. కావున మనము ఈ రోజులతో అధిక లబ్ధి పొందవలెను. సాధారణంగా రమజాన్ మాసంలో అల్లాహ్ తాలా షైతాన్‌ను బంధించి స్వర్గపు ద్వారాలు తెరచి, తన దాసులకు దగ్గర చేస్తాడు. కావున రమజాన్ మాసపు శుక్రవారాలతో పూర్తి లాభాన్ని పొందాలి. ఈ రోజులలో మానవుడు అత్యంత వినయ, విధేయతలతో అల్లాహ్ తాలాతో చేయవలసిన ముఖ్యమైన దుఆ ఏమనగా ! ఓ నా అల్లాహ్ ! నన్ను కేవలం రమజాన్‌లోనే కాక సాధారణ రోజులలో కూడ పగలు, రాత్రుల్లో దుఆలు స్వీకరించబడు ప్రజల సమూహములో చేర్చుము. తద్వారా రమజాన్ ఒక పవిత్ర మార్పుకు కారణం కాగలదు. ఈ విధంగా నేను కూడ శాశ్విత మార్గదర్శనం పొందువారిలో చేరుదును.

నేను పఠించిన గత సూక్తులలో ఉపవాసాల ఘనతను వివరిస్తు, మీ పూర్వపు జాతులపై కూడ ఉపవాసం విధిగావింపబడిందని అల్లాహ్ తాలా తెలిపినాడు. దీని భావము గత జాతులు ఉపవాసం ఉన్నందున మీకు ఉపవాసాలు ఉండవలెనని కాదు. ఈ సూక్తి చివరలో لَعَلَّكُمْ تَتَّقُونَ అనబడెను. అనగా! మీరు దైవభీతిని పొంది, ఆధ్యాత్మికత మరియు సత్ ప్రవర్తనల లోపాల నుండి రక్షింపబడాలి.

ఇక్కడ నేను చదివిన సూక్తి చివరలో అల్లాహ్ తాలా لَعَلَّهُمْ يَرْشُدُونَ మార్గదర్శనం పొందుము అనెను రుష్ద్ అనగా సరియైన, నిజమైన సన్మార్గము, సరియైన ఆచరణ, సన్మార్గము, ఉత్తమ ప్రవర్తన మరియు వివేక, విజ్ఞాన పరిపూర్ణత, వాటిని సరిగా వినియోగిస్తూ తమ స్థితిని మెరుగుపర్చుకొనుట, స్థిరత్వాన్ని ప్రదర్శించాలి. అల్లాహ్ తాలా ఎదుట మానవుడు వినయంతో నిలబడ్డప్పుడు దుఆల స్వీకరణ దృశ్యమును చూస్తాడు. అప్పడే ధన్యుడగును. ఈ విధంగా అల్లాహ్ తాలా శుభాలను పొందుతాడు.

రమజాన్ అనంత శుభముల మాసము. కాని అల్లాహ్ ఆదేశాలను స్వీకరించి, విశ్వాసములో అభివృద్ధి చెందు వారికే ఆయా శుభములు లభించును. కేవలం రమజాన్ మాస జుమాలలో నిబద్ధతను చూపి తర్వాత ఇష్టం వచ్చినట్టుగా వ్యవహరిస్తామని భావించినచో ఇది అల్లాహ్ ఆజ్ఞలను పాటించినట్లు కాదు. మరియు విశ్వాసములో బలహీనతను ప్రదర్శించుట అవుతుంది. ఇటువంటి బలహీనతను ప్రదర్శించి అల్లాహ్ మా దుఆలను స్వీకరించుట లేదు అని ఫిర్యాదు చేయలేము. కావున అల్లాహ్ తాలా శరణు కోరుకొను నిజమైన విశ్వాసి అత్యంత వినయ, విధేయతలతో తమ బలహీనతలను, తప్పిదములను అంగీకరిస్తు ఈ రోజులలో దుఆలు చేయాలి. రమజాన్ నెలలో గల ఈ నమాజ్ జుమాల ఉత్తీర్ణత శాశ్వతమైనదిగా కావాలి అశాశ్వతం కారాదు. ఈ రోజులలోనే అల్లాహ్ తాలా సమీపిస్తాడని కావున ఇప్పుడు ఆరాధిస్తే సరిపోతుందని కొందరు భావిస్తారు. ఇలా భావించినచో ఆత్మవంచన అవుతుంది. కావున దీని నుండి దూరముండాలి. మరియు పరిపూర్ణ వినయ విధేయతలతో అల్లాహ్ తాలా దాసుడై అతని సామీప్యాన్ని పొందే ప్రయత్నం చేయాలి. అల్లాహ్ తాలా ఎల్లప్పుడు సమీపంగానే యున్నాడు. మరియు ప్రతి చోట కలడు. అయితే దాసుడు బహు దైవారాధన నుండి దూరముంటూ కేవలం అల్లాహ్ కై సాష్టాంగము చేసినచో వారి స్థాయిని బట్టి అతని అనుగ్రహన్ని పొందును. అప్పుడే మన దుఆలు స్వీకరింపబడి అల్లాహ్ తాలాతో మనం కోరిన దానిలో మనకు ఉత్తమమైనది ప్రతి ఒక్కటి లభిస్తుంది.

కావున మనము సత్కార్యములు చేస్తూ దైవభీతి పై నిలుస్తూ మాత్రమే మన లక్ష్యాలను పొందగలమని గుర్తుంచుకొనుము. అల్లాహ్ తాలా మన కొరకు విధించిన ఫలములు వ్యక్తిగతంగా కూడ, జమాఅత్ పరంగా కూడ మనకు లభించును. నేను తెల్పినట్లు మనము వినయ, విధేయతను ప్రదర్శిస్తూ తమ పొరపాట్లను ఒప్పుకొని అల్లాహ్ తాలాను పొందుటకు కృషి చేసినచో అల్లాహ్ తాలా శుభముతో ఫలములు అందును. మానవునిలో లోపాలున్నను, పాపిష్టుడైనను, పొరపాటు చేసినను, అతని హృదయములో అల్లాహ్ తాలా భయము ఉన్నంత వరకు, తప్పులను అంగీకరించినంత వరకు అల్లాహ్ తాలా మన పాపాలను కప్పిపుచ్చుచుండును. మరియు ఒక రోజు అతనికి తప్పకుండ పశ్చత్తాపము చెందు అవకాశం లభించును.

ఈ రోజులలో మనలోని ప్రతి ఒక్కరు మన కొరకు, మన బంధువుల కొరకు, జమాత్ సభ్యులకు అల్లాహ్ తాలా నిష్టాపరత లభించవలెనని దుఆ చేయాలి. మనము పరస్పరము బాధలో దుఆ చేసినప్పుడు దేవదూతలు కూడ మన కొరకు దుఆలు చేస్తారు. రమజాన్ నిజమైన, శాశ్వత శుభములను కూడ పొందు వారమవుతాము.

దైవ భక్తి అనగానేమి? అల్లాహ్ తాలా భయము, భక్తియే ధర్మబద్ధత మనలో అల్లాహ్ తాలా భయము, భక్తి ఉన్నంత వరకు మన లోపాలను, పాపాలను అల్లాహ్ తాలా కప్పిపుచ్చును. అతని రక్షణలో ఉంటాము. అతని భయ, భక్తులు మన హృదయములో నుండి చెరిగిపోయి. మన ఇష్టానుసారం తప్పు జరిగినచో, అల్లాహ్ భయ, భక్తి మనలో ఉన్నచో అల్లాహ్ తాలా అమితంగా క్షమించును. అల్లాహ్ భీతి అనగా అల్లాహ్‌పై అభిమానము కావున ఈ అభిమానాన్నే మన హృదయాలలో నిలుపుకొని, దానిని ప్రదర్శిస్తున్నంత కాలం మనం వినాశనం నుండి రక్షించబడుతాము. అది నిజమైన అభిమానమై ఉండాలి. అల్లాహ్ తాలా హృదయాలను ఎరుగును అతన్ని మోసం చేయలేము. కావున ఆ ప్రేమ హృదయములో ఉన్నచో ఎప్పుడో ఒకసారి బయట పడుతుంది. అల్లాహ్ తాలా భయము కొన్ని విషయాల నుండి ఆపును. ఈ ప్రేమ వల్ల మనం అతని ఆజ్ఞలను పాటించినచో తన దాసులను అమితంగా అభిమానించు అల్లాహ్ తాలా మనల్ని వృధా చేయడు. మనకు పశ్చత్తాప పడు అవకాశం ఇచ్చును. కాని నేను తెలిపినట్లు మానవుడు పూర్తిగా దైవభీతిని విడిచిపెట్టి కేవలం పాపంలోనే మునిగినచో ఖచ్చితంగా శిక్షపడుతుంది. అల్లాహ్ తాలా దయ వలన మనము హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాంను విశ్వసించినాము. వారు జమాఅత్ సభ్యులకు ఎల్లప్పుడు దైవభక్తిని పొందాలని ఉపదేశించారు. దైవ భక్తిని పెంపొందించుకొనుట పట్ల దృష్టిని మరల్చు ఆధ్యాత్మిక వ్యవస్థను అల్లాహ్ తాలా మనకు ప్రసాధించినాడు. ఆ దైవ భక్తిని నిలుపు కొనుటకు, అభివృద్ధికై అల్లాహ్ తాలా మన కొరకు ప్రతి సంవత్సరం రమజాన్ మాసాన్ని నియమించెను. మరియు దానిని పెంపొందించుకొను మార్గాలను తెలిపి ఫలవంతం చేసుకోమని శుభవార్త నిచ్చినాడు.

ఈ మాస శుభములతో లబ్ధి పొందేందుకు మనలోని ప్రతి ఒక్కరు అల్లాహ్ దాసుడగుటకు ప్రయత్నించాలి. మన లోపాల వల్ల మన దుఆలను

(8వ పేజిలో చదువుము)

# జుమా ప్రసంగము

కొన్ని ప్రత్యేక విషయాలు ప్రస్తావనకు వచ్చినప్పుడు వాటిని నివృత్తి చేయుటలో అవతారుని ప్రమేయం తప్పక ఉండాలని భావించినచో ప్రపంచ మార్గదర్శనం కోసం తమరే స్వయముగా సమాధానములు ఇచ్చేవారు.

ప్రతి ధర్మ సందేహాన్ని హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం పండితుల వద్ద నివృత్తి చేసుకొనుమని సూచించకుండా వివిధ సంధర్భాలలో అనేక ధర్మ సందేహాలను స్వయంగా వారు కూడ నివృత్తి చేసిరి. వివిధ సంధర్భాలలో వారు అలైహిస్సలాం నివృత్తి చేసిన అనేక ధర్మ సందేహాలన్నింటిని పాకిస్తాన్‌లోని ప్రచురుణ శాఖ విభాగం చాలా వరకు శ్రమించి అనేక మంది పండితుల (జామియాలో ఫిఖ్హ భోధించే ఆచార్యులు మరియు విద్య నభ్యసించుచున్న విద్యార్థుల) సహకారంతో క్రోఢీకరించి, **ఫిఖ్హుల్ మసీహ్** నామముతో ప్రచురించినది. ధర్మసందేహములను నివృత్తి చేసుకొనుటకు జమాఅత్ సభ్యులు ఈ పుస్తకమును తీసుకొనినచో చాలా ఉత్తమముగా యుండును.

జుమా నమాజ్‌తో అసర్ నమాజ్ కలిసి చదివినచో జుమా నమాజ్‌కు ముందు గల సున్నతులను తప్పకుండ చదువవలెను.

గౌ॥ డాక్టర్ అతావుర్రహ్మాన్ సాహీవాల్ ప్రాంతపు పూర్వ అధ్యక్షుల గారి శ్రీమతి గౌ॥ అమతుల్ హఫీజ్ రహ్మాన్ గారి మరణ వారత్నడు తెతిపి వారి నమాజె జనాజ చదివించిరి.

**సయ్యిద్నా అమీరుల్ ముమినీన్ హజ్రత్ మిర్జా మస్రూర్ అహ్మద్ ఖలీఫతుల్ మసీహుల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ క్రీ.శ. 22 ఏప్రిల్ 2016 ( 22 షహాదత్ 1395 హి.ష) తేదీన మస్జిద్ బైతుల్ ఫుతూహ్, లండన్‌లో ప్రసంగించిన ఖుత్బా జుమా.**

أَشْهَدُ أَنْ لَّا إِلٰهَ إِلَّا اللهُ وَحْدَهُ لَا شَرِيكَ لَهُ وَأَشْهَدُ أَنَّ مُحَمَّدًا عَبْدُهُ وَرَسُولُهُ
أَمَّا بَعْدُ فَأَعُوذُ بِاللهِ مِنَ الشَّيْطٰنِ الرَّجِيمِ - بِسْمِ اللهِ الرَّحْمٰنِ الرَّحِيمِ
اَلْحَمْدُ لِلّٰهِ رَبِّ الْعَالَمِينَ ۔ اَلرَّحْمٰنِ الرَّحِيمِ ۔ مٰلِكِ يَوْمِ الدِّينِ ۔
إِيَّاكَ نَعْبُدُ وَإِيَّاكَ نَسْتَعِينُ ۔ اِهْدِنَا الصِّرَاطَ الْمُسْتَقِيمَ ۔
صِرَاطَ الَّذِينَ أَنْعَمْتَ عَلَيْهِمْ غَيْرِ الْمَغْضُوبِ عَلَيْهِمْ وَلَا الضَّآلِّينَ ۔

మానవునికి రెండు విషయాలలో స్పష్టత చాలా ముఖ్యమని హజ్రత్ ముస్లిహ్ మౌవుద్ రజియల్లాహు అన్హు ఒక సంధర్భములో ఉపదేశించిరి, మొదటిది ఆలోచన, అవగాహన. రెండవది సున్నితమైన మనస్తత్వం, సత్కార్యపు ఉత్తేజము మరియు హృదయంలో స్థిరత్వం పొంది ప్రభావితం చేయు ఆలోచనలు. అనగా ఉత్తేజముల కోరిక. హృదయ పవిత్రత వలన సత్కార్యపు ఉత్తేజములు జనించును. అనగా హృదయము మరియు ఆలోచనల శైలి సంపూర్ణముగా పావన మైనప్పుడే స్థిరంగా ప్రభావం చూపే పవిత్రమైన, పుణ్యఫలము నొందు ఆలోచనలు జనించును. అనగా ఆలోచనలు, ఊహలు, పరిశీలనలు ఎల్లప్పుడు నిర్మలమైనవిగా యుండుటనే అరబ్బి భాషలో తన్‌వీర్‌గా పేర్కొనడం జరుగుతుంది. ఈ తన్‌వీర్ నిష్కల్మషమైన మేధస్సు ద్వార చేకూరుతుంది. మానవునిలో ఎల్లప్పుడు స్వచ్ఛమైన ఆలోచనలను కల్గించు జ్యోతినే తన్‌వీర్ అందురు. ప్రయత్నములతో పవిత్ర ఆలోచనలు పుట్టించకుండా ఎల్లప్పుడు మంచి ఆలోచనలు కల్గించు, పొరపాటున కూడ చెడు ఆలోచనలను దరికి చేరనీయ కుండా కాపాడు ఉత్తమ గుణమే తన్‌వీర్ లక్షణము. అందరికి తెలిసిన విషయం ఏమిటనగా అల్లాహ్ తాలా అనుగ్రహము, నిరంతర కృషి వలనే ఈ స్థానము లభించును. మొత్తమునకు ఈ ఆంశంను గూర్చి హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాంను ఆధారం చేసుకొని హజ్రత్ ముస్లెహ్ మౌవుద్ (ర.అ) ఇలా ఉపదేశించిరి.

హజ్రత్ మసీహ్ మావుద్ (అ) తెలుపుచుండగా నేను స్వయముగా విన్నాను, కొన్ని సంధర్భాలలో ఎవరైన తమరితో ధర్మ సందేహాలను (ఫిఖ్హి విషయాలు) అడిగినచో తమరు (అ) మౌల్వి నూరుద్దీన్ సాహిబ్ గారి, లేదా మౌల్వి అబ్దుల్ కరీం గారి లేదా మౌల్వి సయ్యద్ అహ్సన్ సాబ్ గారి లేదా మరో మౌల్వీ గారి నామమును ప్రస్తావించుచూ వారిని అడిగి తెలుసుకొనుము అని సూచించే వారు. ఎందుకనగా వీరందరు ప్రతిరోజు ధర్మ సందేహాలను నివృత్తి చేయు కార్యములలోనే ఎక్కువ భాగం నిమగ్నమై ఉండేవారు, కావున వీరికే వీటిని గూర్చి జ్ఞప్తి అధికంగా యుండును. కాని కొన్ని ప్రత్యేక విషయాలు ప్రస్తావనకు వచ్చినప్పుడు వాటిని నివృత్తి చేయుటలో అవతారుని ప్రమేయం తప్పక ఉండాలని భావించినచో ప్రపంచ మార్గదర్శనం కోసం తమరే స్వయముగా సమాధానములు ఇచ్చేవారు. అలా కాకుండ చిన్న చిన్న సమస్యలు, సందేహాలు వచ్చినచో వాటికి నూతనమైన సమాధానం అవసరం లేనిచో తమరు ఫలానా మౌల్వి సాహిబ్ ను అడిగి తెలుసుకొనుము అని సూచించేవారు. అంతేగాకా ఆ సమయంలో ఆ మౌల్వీ అచటనే యున్నచో మౌల్వీ గారు ఈ సందేహానికి సమాధానం ఏమిటని అడిగేవారు. మరి కొన్ని సంధర్భాలలో ఏ మౌల్వీనైన సూచించినప్పుడు ఆ మౌల్వీ ఆ సమావేశంలోనే ఉన్నచో నా ఆలోచన ప్రకారముగా ఇందుకు సమాధానం ఈ విధముగా ఉండాలని కూడ తెలిపేవారు. మరల వారు అలైహిస్సలాం ఇలా తెలిపిరి, నేను పొందిన అనుభవం ప్రకారం కొన్ని సంధర్భాలలో నాకు తెలియని విషయము ఏదైన తారస పడినప్పుడు నా స్వభావము నుండి వచ్చిన సమాధానమును తరువాత పరిశీలించినచో ఆ సమాధానం సున్నత్ మరియు హదీస్‌లకు అనుగుణంగా లభించేది.

హజ్రత్ ముస్లెహ్ మౌవూద్ (ర) మరల ఇలా తెల్పిరి; మానవుని మేధస్సులో జన్మించు పవిత్రమైన ఆలోచన లన్నింటిని తన్‌వీర్ అందురు. ఆరోగ్యవంతుని ఒక లక్షణం ఏమనగా మానవుడు తనకు తాను నేను ఆరోగ్యముగానే యున్నానని చెప్పుకోవడం. ఆరోగ్యవంతుని రెండవ లక్షణం ఏమిటనగా ఇక ముందు కూడ అతడు ఆరోగ్యముగా ఉండుట, ఇదే అసలైన ఆరోగ్యతకు చిహ్నం. మరల వారు (ర) ఇలా తెల్పిరి: ఆధ్యాత్మిక అభివృద్ధి కొరకు స్వచ్ఛమైన ఆలోచనల అవసరమున్నట్లుగా, దైవభీతి, పవిత్రత కూడ ముఖ్యమే. వాస్తవము ఏమిటనగా తన్‌వీర్ అనుబంధం మెదడుతో నున్నట్లే, దైవభీతి అనుబంధం కూడ హృదయముతో నుండును. సాధారణముగా కొందరు సత్కర్మలను, దైవభీతిని ఒకటిగానే భావిస్తారు. కాని సత్కార్యాము అనగా మనము చేయు లేదా చేయతలంచిన ప్రయోజన

కరమైన కార్యము. దైవభీతి అనగా మానవునిలో ఇక ముందు జన్మించు ఆలోచనలన్నియు పవిత్రమైనవిగా నుండుట. నేను పైన తెల్పినట్లు ఆలోచనలు, ఊహలు, పరిశీలనలు ఇవి అన్నియు మేధస్సుతో అనుసంధానమై యుండును. దీనినే తన్‌వీర్ అందురు. ఎల్లప్పుడు సత్కార్యాములు చేయవలెననే బలమైన కోరికయే దైవభీతి. ఇది హృదయముతో అనుసంధానమై యుండును. మానవునిలో దైవభీతి మరియు తన్‌వీర్ ఈ రెండు జనించిన రోజున అతడు అన్ని రకాల దుష్ట ఆలోచనల నుండి పూర్తిగా రక్షించబడును. మానవుడు ఏ రోజున పూర్తిగా చెడుల నుండి రక్షించబడునో ఆ రోజు నుండి అతడు అల్లాహ్ తాలా అనుగ్రహం క్రిందికి చేరుకొనును.

(అల్ ఫజల్ , మార్చి 9, 1938, పుట 2, సంపుటి 26, సంచిక 55)

హజ్రత్ ముస్లెహ్ మౌవూద్ (ర) తెల్పినట్లు సాధారణ సందేహాలను ప్రశ్నించువారు వచ్చినప్పుడు హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం జమాఅత్ పండితులను సంప్రదించగలరని సూచించేవారు. కాని చూడడానికి సాధారణంగా ఉన్న సందేహాలను నివృత్తి చేయుటలో వారు (అ) పండితులకు కూడ సలహాలు ఇచ్చేవారు. ఉదాహరణకు ప్రయాణంలో నమాజ్‌ను తగ్గించు విషయమే గలదు. దేనిని ప్రయాణంగా భావించవలెను, ఏ ఏ సమయంలో నమాజ్‌ను తగ్గించి సలుపవలెను అనే ప్రశ్నకు సమాధానం ఇస్తూ , హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇలా తెల్పిరి: నా అభిమతం ఏమిటనగా మానవుడు ఇబ్బందులను అధికంగా తనపై వేసుకోకూడదు, కష్టాలను అధికంగా తనపై వేసుకోకూడదు. శాస్త్రీయ పద్ధతిలో దేనినైతే ప్రయాణంగా చెప్పుకొందుమో అది కేవలం రెండు, మూడు మైళ్ల దూరమే అయినను నమాజ్‌ను తగ్గించి సలుపుము, అదే విధముగా ప్రయాణ ప్రమాణాలను ఆచరించుము. ఆచరణ అనునది సంకల్పముపైనే ఆధారపడి యుండును. కొన్ని సంధర్భాలలో మనము రెండు, మూడు మైళ్ళ దూరమును కూడ స్నేహితులతో కలిసి సరదాగా నడుస్తూ ఉంటాము. మనకు ప్రయాణించిన అనుభూతియే కలుగదు. కాని ఎప్పుడైతే మానవుడు తన సామాగ్రిని చేత బూని ప్రయాణం అనే సంకల్పంతో ప్రయాణంను కొనసాగించునో అప్పుడు అతడు ప్రయాణికుడిగా భావించబడును. ధర్మ శాసనము కష్టతరంగా రూపొందించలేదు. శాస్త్రీయంగా దేనిని మీరు ప్రయాణంగా భావించెదరో అదియే ప్రయాణం.

(మల్ఫూజాత్ సంపుటి 2, పుట 211, ఎడిషన్ 1985, లండన్)

దీనిని బట్టి మనకు అర్ధమైనది ఏమనగా దేనినైతే మనము ప్రయాణం అనే సంకల్పంతో ప్రయాణించెదమో అదియే అసలైన ప్రయాణం. కొన్ని రోజుల క్రితం Leicester (లీస్టర్)లో మస్జిద్ ప్రారంభోత్సవ వేడుకకు నేను వెళ్ళినప్పుడు ప్రారంభోత్సవం వెంటనే మరలి వచ్చెదనని భావించి వెళ్ళితిని. అచట నేను ఇషా నమాజ్‌ను పూర్తిగా చదివించితిని. దీనిపై కొందరు నమాజ్‌ను ఎందుకు తగ్గించి చదివించలేదని ఆలోచించ సాగిరి. కాని ఆ సమయంలో సామాగ్రిని తీసుకొని ప్రయాణపు సంకల్పంతో చేయు ప్రయాణంనే ప్రయాణంగా భావించవలెను అనే హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం గారి ఉపదేశము నా ఆలోచనలో గలదు. నా ప్రయాణం ఈ విధమైన సంకల్పంతో కూడిన ప్రయాణం కాదు. నేను వెంటనే మరలి వచ్చెదను అనే సంకల్పంతోనే అచటకు వెళ్ళితిని. అందువలనే నేను నమాజ్‌ను తగ్గించి సలుపలేదు. అంతేగాకా "ఇన్నమల్ ఆమాలూ బ్బిన్నియాత్" కూడ నా దృష్టిలో గలదు. ఇది మానవుని దృష్టిలో యున్నచో మానవుడు అధికంగా తనపై భారంను వేసుకోలేడు. అవసరమును మించి సౌలభ్యమును అన్వేషించలేడు. ఉద్దేశం కేవలం అల్లాహ్ తాలా మరియు అతని ప్రవక్తల ఆదేశాలకు అనుగుణంగా నడుచు కొనవలెను. దీనిని మిక్కిలి వివరిస్తు హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) మరల ఇలా తెల్పిరి: మీ సంకల్పమును క్షుణ్ణంగా పరిశీలించుకొనుము. ఈ విషయాలన్నింటిలో దైవభీతిని అధికంగా కల్గి యుండాలి. ఒకవేళ ఒక వ్యక్తి ప్రతి రోజు ఏదైన వ్యాపారం కొరకు గాని లేదా మరే విధమైన కార్యముపై గాని ప్రయాణం చేయుచున్నచో అది ప్రయాణంగా భావించబడదు. మానవుడు కేవలం ఒక ప్రత్యేక సన్నద్ధతో ప్రయాణించినచో దానినే ప్రయాణంగా లెక్కించబడును. కేవలం ఆ ప్రత్యేకతతో మాత్రమే గృహము నుండి బయలు దేరవలెను. మరల వారు ఇలా తెల్పిరి: చూడండి మేము సాధారణంగానే ప్రతి రోజు రెండు, మూడు మైళ్ళ దూరంను చుట్టివచ్చెదము. కాని అది ప్రయాణం కాదు. ఇలాంటి పరిస్థితులలో మన హృదయం ఏమి తెలుపుచున్నదో గ్రహించవలెను. ఒకవేళ అది ప్రయాణమని తెల్పినచో నమాజ్‌లను తగ్గించి సల్పుము. అందుకే మీ హృదయం నుండి తీర్పును ఆశించుము. వేల ఫత్వాలు ఉన్నను విశ్వాసుని హృదయ సంతృప్తి వాటి అన్నింటికన్న గొప్పది.

(మల్ఫూజాత్ సంపుటి 10, పుట 99-100, ఎడిషన్ 1985, లండన్)

అందువలనే కొన్ని కొన్ని సంధర్భాలలో సంకల్పమును మరియు హృదయ ఫత్వాను కూడ క్షుణ్ణంగా పరిశీలించుకోవలెను. పవిత్రమైన సంకల్పము కావలెను. ఆ పవిత్రమైన సంకల్పముతోనే హృదయ ఫత్వాను ఆశించవలెను.

కేంద్రీయ ప్రాంతమునకు వచ్చిన సంధర్భాలలో నమాజ్‌ను తగ్గించి చదువవలెనా ? లేదా ? అని ఒక వ్యక్తి హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాంను ప్రశ్నించెను, నేడు కొందరు ఈ విధముగానే ప్రశ్నించుచున్నారు. అందుకు సమాధానం ఏమిటనగా కేంద్రీయ ప్రాంతానికి వెళ్ళినచో అనగా ఖాదియాన్, రబ్వా, లండన్ ప్రాంతాలకు వెళ్ళినచో నమాజ్‌ను తగ్గించి సల్పకూడదు. ఏ వ్యక్తి అయితే కేవలం మూడు రోజుల సంకల్పంతోనే ప్రయాణం చేసి ఇచటకు చేరుకొనునో ఆ వ్యక్తి నమాజ్‌ను తగ్గించి చదువుకోవచ్చునని హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం సమాధానం ఇచ్చిరి. కాని నా దృష్ట్యా ఏ ప్రయాణంలో నైతే ఒక వ్యక్తి ప్రయాణ సంకల్పముతో ప్రయాణం కొనసాగించునో అది రెండు, మూడు మైళ్ళే అయినను నమాజ్‌ను తగ్గించి చదువుకోవచ్చును. ఒకవేళ నమాజ్ చదివించు ఇమాం ప్రాంతీయుడే అయినచో అతని సమక్షంలో పూర్తి నమాజ్‌ను సల్పవలసి యుండును. ప్రాంతీయ పరంగా ఎక్కడికి వెళ్ళినను అది కేంద్రమైనను, లేదా మరేదైన ప్రాంతమైనను నమాజ్ చదువించు వారు ప్రాంతీయులే అయినచో వారు పూర్తి నమాజ్‌ను చదువించెదరు, కావున ప్రయాణికులు కూడ వారి సమక్షంలో పూర్తి నమాజ్‌ను చదువలసి యుండును. వారు మరల ఇలా తెలిపిరి, అధికారుల పర్యటనలు ప్రయాణంగా భావించబడవు. ఏ అధికారులు పర్యటనల నిమిత్తం ప్రయాణాలు చేయుదురో, వారి ఆ పర్యటనలు ప్రయాణాలుగా భావించబడవు. అది కేవలం ఒక వ్యక్తి తన తోటలో పర్యటించినట్లుగా భావించబడును.

(మల్ఫూజాత్ సంపుటి 5, పుట 311, ఎడిషన్ 1985, లండన్)

హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం తమ అనుచరుల సందేహాలను ఏ విధముగా నివృత్తి చేసేవారో ఆ విధానాన్ని తెలుపుతూ ఖాజి అమీర్ హుస్సేన్ గారు ఈ విధముగా తెలిపిరి, సాధారణ పరిస్థితులలో ప్రయాణం చేయుచున్నప్పుడు కసర్ నమాజ్ చదువకూడదని, కేవలం యుద్ధ సమయాలలో, అల్లకల్లోల పరిస్థితులలో మాత్రమే చదువవలెనని నేను మొదట్లో భావించేవాడిని. పైగా ఈ విషయంలోనేను హజ్రత్ మౌల్వి హకీం నూరొద్దీన్ గారితో సుదీర్ఘంగా చర్చించేవాడిని. ఖాజి గారు మరల ఇలా తెల్పిరి; ఆ రోజులలో హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం గారి వ్యాజ్యము గుర్దాస్‌పూర్ పూర్‌లో కొనసాగుచుండెను. ఒక రోజు నేను కూడ వారితో గుర్దాస్‌పూర్‌కు వెళ్ళితిని, హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాంతో పాటు హజ్రత్ మౌల్వి నూరొద్దీన్ (ర) మరియు మౌల్వి అబ్దుల్ కరీం గారు కూడ ఉన్నారు. ఇంతలో జోహర్ నమాజ్ సమయం అయినది, హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం గారు నన్ను జోహర్ నమాజ్ చదువించమని సూచించిరి. (అనగా ఖాజి గారిని.) మరల వారు ఇట్లు తెల్పిరి: ఈ రోజు నాకు అవకాశం లభించినది. కావున నేను కసర్ నమాజ్ చదువించకుండా పూర్తి నమాజ్‌ను చేయించెదను, అప్పుడు ఈ సమస్యకు పరిష్కారము కూడ లభించును, నా ఈ చర్యపై హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఏదో ఒక తీర్పును ప్రకటించెదరని నేను నా మనస్సులో నిశ్చయించుకున్నాను. కసర్ నమాజ్ చేయించకూడదనే నిర్ణయముతో నమాజ్ చేయించుటకు సంకల్పంను చేస్తు అల్లాహు అక్బర్ అని చేతులు ఎత్తుచుండగా, నా వెనుక భాగంలో కుడి వైపున నిలుచున్న

హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) వెంటనే రెండు అడుగులు ముందుకు వేసి నా చెవిలో ఖాజి గారు రెండు రకాతులే చేయించెదరు కదా? అని తమ అభిప్రాయమును వెల్లడించిరి. అందుకు నేను కూడ హుజూర్ రెండు రకాతులే చదువించెదనని సమాధానం ఇచ్చితిని. మరల ఖాజి గారు ఇలా తెల్పిరి: ఆనాటి నుండి మా మధ్య కొనసాగుచున్న ఈ సమస్యకు శాశ్విత పరిష్కారం లభించినది. అందువలన చివరికి నేను నా అభిప్రాయమును మార్చుకున్నాను.

(సిరతుల్ మహ్ది, ,సంపుటి 1, పుట 24,25. ఉల్లేఖనం సంఖ్య 33)

ఈ విధముగా అనుచరులు తమ అభిప్రాయాలను మనస్పూర్తిగా మార్చుకునేవారు.

ఈ సంధర్భములో మీకు ఒక విషయమును తెలియజేయుదును. ప్రతి ధర్మ సందేహాన్ని హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం పండితుల వద్ద నివృత్తి చేసుకొనుమని సూచించకుండా వివిధ సంధర్భాలలో అనేక ధర్మ సందేహాలను స్వయంగా వారు కూడ నివృత్తి చేసిరి. వివిధ సంధర్భాలలో వారు అలైహిస్సలాం నివృత్తి చేసిన అనేక ధర్మ సందేహాలన్నింటిని పాకిస్తాన్‌లోని ప్రచురుణ శాఖ విభాగం చాలా వరకు శ్రమించి అనేక మంది పండితుల (జామియాలో ఫిఖ్‌హ భోధించే ఆచార్యులు మరియు విద్య నభ్యసించుచున్న విద్యార్థుల) సహకారంతో క్రోఢీకరించి, **ఫిఖ్‌హుల్ మసీహ్** నామముతో ప్రచురించినది. ధర్మసందేహములను నివృత్తి చేసుకొనుటకు జమాఅత్ సభ్యులు ఈ పుస్తకమును తీసుకొనినచో చాలా ఉత్తమముగా యుండును. ఈ పుస్తకమును క్రోఢీకరించి ప్రచురించుటకు సహకరించిన వారందరికి అల్లాహ్ తాలా ప్రతిఫలములు అందించును గాకా!, అవకాశం లభించిన ప్రతి సంధర్భములో నేను కూడ ఈ విషయాలను తెలియపర్చుతూ ఉంటాను.

జుమా నమాజ్‌తో అసర్ నమాజ్ కలిసి చదివినచో జుమా నమాజ్‌కు ముందు గల సున్నతులను తప్పకుండ చదువవలెను, ఈ విషయమును గూర్చి హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం గారి విశదీకరణల ఆధారంగా హజ్రత్ ముస్లెహ్ మౌవూద్ (ర) ఇలా తెల్పిరి; ఒకవేళ నమాజ్‌లు చదివినప్పుడు ఆ నమాజ్‌లకు ముందు, చివరల గల సున్నతులు క్షమించబడుతాయని హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) జారి చేసిన ఫత్వ విషయంలో నేటి జుమా నమాజ్ సమయంలో భేదా భిప్రాయాలు ఏర్పడిన విషయంను గూర్చి నేను ప్రయాణంలో ఉండగా ఒక వ్యక్తి నాకు తెలిపెను. అందుకు సమాధానం ఏమనగా, నమాజ్‌లు జమా చేయునప్పుడు లేదా మఘ్‌రిబ్, ఈషా నమాజ్‌లు జమా చేసిన తరుణంలో ఆయా నమాజ్‌ల ముందు, చివరల సున్నతులు క్షమించబడుతాయి అనుటలో ఎలాంటి సందేహం లేదు, కాని అతను తెల్పిన భేదా భిప్రాయము ఏమిటనగా, ఆ వ్యక్తి ఒక ప్రయాణంలో నాతో (అనగా ముస్లెహ్ మౌవూద్ రజి.) యుండిరి. నేను జుమా మరియు అసర్ రెండు నమాజ్‌లను కలిపి చదువించితిని, పైగా జుమాకు ముందు సున్నతులు కూడ చదివినాను. ఈ రెండు సరైన పద్దతులే. నమాజ్‌లు ఏకం చేసి చదవడం వలన వాటి ముందు, తరువాత గల సున్నతులు క్షమించబడుతాయి, ఇది సరైన పద్ధతియే. అదే విధముగా రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం జుమా నమాజ్‌కు ముందు సున్నతులను చదువేవారు. ఇది కూడ సరైన పద్ధతియే. అందుకే నేను కూడ ఆ ప్రయాణంలో చదువినాను, చదువుతూ ఉంటాను. అందుకుగల కారణం ఏమటనగా జుమా నమాజ్‌కు ముందు చదువే సున్నతులు జొహర్ నమాజ్‌కు ముందు చదువే సున్నతుల కన్న భిన్నమైనవి. వాస్తవానికి రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం వాటిని కేవలం జుమా నమాజ్ యొక్క గౌరవార్థం సల్పేవారు.

ప్రయాణంలో జుమా నమాజ్ సల్పవచ్చును, ఉపసంహరించు కోవచ్చును. రెండు పద్ధతులు సరైనవే. ప్రయాణంలో ఉన్నప్పుడు జుమా నమాజ్ చదువచ్చును, ఉపసంహరించు కోవచ్చును అనగా పూర్తిగా నమాజ్‌ను వదలివేయమని అర్థం కాదు, జుమా నమాజ్ సల్పలేనిచో జొహర్ నమాజ్ తప్పకుండా సల్పవలెను. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ప్రయాణములో జుమా నమాజ్ సలుపుటను మరియు ఉపసంహరించుటను కూడ నేను చూసితిని. ఒకసారి ఒక వ్యాజ్యము పై హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం గుర్దాస్‌పూర్‌కు వెళ్ళినప్పుడు అక్కడి పనుల వలన సమయం లభించదని భావించి మనము ప్రయాణంలో ఉన్నందున జుమా చదువలేమని వారు (అ) తెల్పిరి. కాని ఆ బృందంలోని ఒక వ్యక్తి హజ్రత్ ముస్లెహ్ మౌవూద్ (ర) వద్దకు వచ్చి హుజూర్ గారు ఈ రోజు జుమా సలుపలేమని తెల్పినట్లు తెలసినది ఇది వాస్తవమేనా అని అడిగి తెలుసుకొనెను. వాస్తవానికి ఆ వ్యక్తి మదిలో గల ఆలోచనలు ఏమిటనగా ప్రయాణంలో ఎల్లప్పుడు హజ్రత్ మౌల్వి హకీం నూరుద్దీన్ (ర) గారు జుమా చదువించేవారు, ఆ వాజ్యము విషయంలో చాలా రోజుల నుండి హజ్రత్ మౌల్వీ గారు గుర్దాదాస్ పూర్‌లోనే ఉంటున్నారు, కాని ఆ రోజు ఏదో పనిపై ఖాదియాన్‌కు వచ్చిరి, హజ్రత్ మౌల్వీ గారు లేనందువలనే ఈ రోజు జుమా నమాజ్ సలుప లేమని నిశ్చయించుకున్నట్లు భావించి, ఆ వ్యక్తి వెంటనే హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం వద్దకు చేరి హుజూర్ నాకు జుమా నమాజ్ చదువించడం వచ్చునని తెలిపెను. అందుకు హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం గారు చాలా మంచిది, కాని మనము ప్రయాణంలో ఉన్నాము, అందుకే జుమా నమాజ్‌కు బదులు జొహర్ నమాజ్ చదువెదము అని సమాధానం ఇచ్చిరి. అందుకు ఆ వ్యక్తి మరల హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాంతో హుజూర్ నాకు జుమా చదువించడం చాలా బాగా వచ్చును, గతంలో అనేక సార్లు నేను జుమా నమాజ్ చదువించాను అని విన్నవించుకొనెను. అందుకు హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం సరే మంచిది, ఈ రోజు జుమా నమాజ్ చదువెదము అని తెల్పిరి.

హజ్రత్ ముస్లెహ్ మౌవూద్ (ర) మరల ఇలా తెల్పిరి: నేను హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాంను ప్రయాణంలో జుమా చదువుటను చూసినాను, జొహర్ నమాజ్‌ను సల్పుటను చూసినాను. అందువలనే నేను ప్రయాణంలో జుమా మరియు అసర్ నమాజ్ ఏకం చేసి సల్పుచున్న సంధర్భాలలో జుమా నమాజ్‌కు ముందు రెండు రకాతుల సున్నతులు చదువుతాను. నా అభిప్రాయం ఏమిటనగా వాటిని చదువవలెను. ఇదియే ఉత్తమము. ఎందుకనగా ఇవి సాధారణ సున్నతులకు భిన్నమైనవి. మరియు జుమా యొక్క గౌరవార్దం నిర్ణయించినవి.

(అల్ ఫజల్ 24 జనవరి 1942. సంపుటి 20, సంచిక 21, పుట 1)

కావున జుమా మరియు అసర్ నమాజ్‌లు ఏకం చేసి చదివినా కూడ వాటి ముందు ఈ రెండు రకాతుల సున్నతులను తప్పకుండ చదువవలెను.

మానవుని జీవితంలో వ్యక్తిగతంగా, జమాఅత్ పరంగా, ప్రాంతీయ పరంగా సంతోషపు ఘడియలు వస్తూనే ఉంటాయి. ఆ సంతోష సమయాలను సంధర్భాను కూలంగా బహిర్గతం చేస్తూనే ఉంటారు, కాని కొందరు అధిక మొత్తములో వృధా ఖర్చులు చేస్తూ ఉంటారు. లేదా సంతోషం పేరుతో విచ్చల విడిగా ఖర్చు చేస్తూ ఉంటారు. కొందరి దృష్టిలో ధార్మిక సంతోషాలను లేదా ఇతర సంతోషాలను వ్యక్త పర్చడంను పాపంగా భావించబడును. ఇస్లాం ఈ రెండు విధానాలను ఖండించుచున్నది. నేటి కాలంలో మనకు ఇస్లాం భోధనలను అనుసరించి ప్రాపంచికంగాను, ఆధ్యాత్మికంగాను ప్రతి చిన్న చిన్న విషయాలలో కూడ మనకు మార్గదర్శనం చేయుచు మధ్యతరహా నడవడికను నడిపించుటకు హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం విచ్చేసిరి. నమాజ్‌లను గూర్చి నేను ఇప్పుడే తెలుపుచు వచ్చినాను, కావున సంతోషాలను ఎలా వెల్లడించాలి అనే ఆంశంలో హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఏ విధముగా తమ ఆచరణల ద్వారా మనకు మార్గదర్శనం చూపినారో నేను మీముందు ప్రస్తావించెదను. హజ్రత్ ముస్లెహ్ మౌవూద్ (ర) ఇలా తెల్పిరి, హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం శుభసమయాలలో దీపపు కాంతులను వెలిగించినట్లు మనకు ఆధారములు లభించును. విక్టోరియా మహారాణి జూబ్లి వేడుకల సమయంలో హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం దీపపు కాంతులను వెలగించి తమ ఆనంధమును వెల్లడించిరి. ఈ విధముగా హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం రెండు సార్లు దీపపు కాంతులను వెలగించిరి. ఒకటి విక్టోరియా మహారాణి జూబ్లి వేడుక సమయంలో, రెండవది ఎడ్వర్డ్ గారి జూబ్లి వేడుకల సమయంలో, లేదా రెండు సార్లు విక్టోరియా మహారాణి జూబ్లి

వేడుకలోనే అయి ఉండవచ్చును. మొత్తమునకు రెండు సార్లు దీపపు కాంతులను వెలగించినట్లు నాకు గుర్తున్నది. మేము బాల్యములో ఉన్నందున మాకు ఈ దీపపు వెలుగులు చాలా ఆనంధాన్ని ఇచ్చేవి, కొన్ని సంధర్భాలలో దీపంలో నూనే అయిపోయినచో అనుచరులను పంపించి హజ్రత్ మసీహ్ మౌఊద్ (అ) నూనే బుడ్డీలను తెప్పించేవారు. అందులో నూనే ఉన్నందు వలన అవి చాలా సమయం వరకు వెలుగుతు ఉండేవి. మరల వారు (ర) ఇలా తెల్పిరి, మా గృహమునకు, మస్జిద్‌నకు మరియు పాఠశాలను దీపపు వెలుగులతో కాంతింప జేసిరి. మరియు మీర్ ముహమ్మద్ ఇస్‌హాఖ్ గారు కూడ దీనికి సాక్ష్యమునిచ్చిరి. దీపములను అలంకరించుట సరైనది కాదని కొందరు తమ అభిప్రాయమును వ్యక్తపర్చుతుంటారు, కావున వారందరికి తెలుపునది ఏమనగా కేవలం దీపములను వెలిగించుటలో ఎలాంటి దురాచారము లేదు. నా అభిప్రాయము ఏమనగా హజ్రత్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలాం న్యాయనిర్ణేతగా, సమన్యాయము చేకూర్చు వారిగా వచ్చినప్పుడు వారు ఎప్పుడు ఖుర్‌ఆన్ ఆదేశాలకు భిన్నంగా నడుచుకోలేరు, కావున వారి ద్వారా దీపపు కాంతులను ఏర్పాటు చేయుట నిరూపితమైనప్పుడు, సాక్ష్యాలు ఉన్నప్పుడు, మరియు ఈ విషయమును ఆ నాటి ఒక పత్రిక అల్ హకంలో కూడ పొందు పర్చినట్లు ఆధారాలు లభించినపుడు మనము ఈ విషయంపై ఏ ఏ సంధర్భములో చేయాలి, ఎందుకు చేయాలి, ఇవి వృధా ఖర్చులు అని చర్చించుకోవడం సరైన విధానం కాదు. మొత్తానికి మరల వారు ఈ విధముగా తెల్పిరి, ఏది ఏమైప్పటికి ఏవిధముగానైతే ప్రతి విశ్వాసుని చర్యలో ఒక వివేకత యుండునో హజ్రత్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలాం గారు ఆనంధాన్ని వ్యక్త పర్చిన విధానంలోను ఒక వివేకత దాగి యున్నది. కొన్ని సంధర్భాలలో కాంతులను చాలా విశాలవంతగా ఏర్పాటు చేయవలసి యుండును. పైగా ప్రతి గృహము వారు ఏర్పాటు చేయాలని ఆదేశాలు కూడ వస్తాయి. అలాంటి సమయంలో చాలా పెద్ద మొత్తంలో ఖర్చు చేయవలసి ఉంటుంది. అంత పెద్ద మొత్తములో ఖర్చు చేసినపుడు వాటి ద్వారా అంతగా ప్రయోజనం ఏమి ఉండదు. కాని ఆయా దేశ, రాజకీయ ప్రయోజనాల దృష్ట్యా లేదా ఎచటనైతే వెలుతురు తక్కువగా యుండునో ఆయా ప్రాంతాలలో ఈ ప్రయత్నాలు చేసినచో ఎలాంటి తప్పు లేదు. హజ్రత్ మీర్ ముహమ్మద్ ఇస్‌హాఖ్ గారు ఇలా తెల్పిరి, హజ్రత్ ఉమర్ (ర) గారు మస్జిద్‌లో ఎక్కువ కాంతి ఉండుటకు దివ్వెలను ఏర్పాట్లు చేసినట్లు హదీసులలో ఒక ఉల్లేఖనం గలదు. వాస్తవానికి మస్జిద్‌లో ఎక్కువ వెలుగు కావలెను. ఎందుకనగా ప్రజలు అచట ఖుర్‌ఆన్ పఠించెదరు. లేదా దార్మిక గ్రంధాలను అభ్యసించెదరు. కావున హజ్రత్ ఉమర్ (ర) మస్జిద్‌లో వెలుగును ఏర్పాటు చేసినచో అందులో ఒక వివేకత గలదు. అలా కాకుండా ఇస్లాం ప్రకారమే సంతోషంను వ్యక్త పర్చదలచినచో అందులో కూడ ప్రాణకోటికి అధికంగా ప్రయోజనం చేకూర్చు విధముగా వ్యక్తపర్చునట్లు ఆదేశం గలదు. ఉదా॥ అజ్‌హా పండుగ రోజున దాన ధర్మములు చేసినచో పేదలకు కొద్ది మొత్తములో నైన మాంసం లభించును. రంజాన్ పండుగ రోజున ఫిత్రాన ద్వారా పేదలకు చేయూత నివ్వడం జరుగుతుంది. అందువలనే ఇస్లాంలో ఏ సంధర్భములోనైన సంతోషంను వ్యక్త పర్చదలుచుకున్నచో, దేశానికి, ప్రజలకు అధికంగా ప్రయోజనం చేకూర్చునట్లు జరుపుకోగలరని ఆదేశించడం జరిగినది. కాని దీపాలను వెలిగించుటలో అంతగా ఎలాంటి ప్రయోజనం చేకూరదు. కాని హజ్రత్ మసీహ్ మౌఊద్ అలైహస్సలాం దీపాలను వెలిగించుటలో రాజకీయ ప్రయోజనాన్ని దృష్టిలో ఉంచుకొని దీపాలను వెలిగించిరి.

హజ్రత్ ముస్లెహ్ మౌఊద్ (ర) మరల ఇలా తెల్పిరి: పిల్లల మనసు సంతోషంగా ఉండవలెనని కొన్ని సంధర్భాలలో హజ్రత్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలాం మాకు బాణాసంచాలను కూడ తీసుకవచ్చి ఇచ్చేవారు. అంతేగాకుండా గంధకము కాల్చడం వలన క్రిమి కీటకాలు నాశనం అవుతాయని కూడ తెలిపేవారు. కేవలం పిల్లలను సంతోష పెట్టుటకు కాకుండా బాణా సంచాలు కాల్చడం వలన అందులోని గంధకము కాలి క్రిమి కీటకాలు నాశనమై వాతవరణం స్వఛ్ఛతగా మారుతుంది. అందువలనే వారు (అ) మాకు ఎన్నో సార్లు చిచ్చుబుడ్లు, టపాకాయల వంటి బాణాసంచాలను తీసుక వచ్చి ఇచ్చేవారు. ఇవి ఖర్చుతో కూడుకున్నవే అయినను వాటి ద్వారా కొంత మొత్తములో ప్రయోజనం చేకూరును. బాహ్యంగా కాకున్నను పిల్లల మనసు సంతోషం చెందును. అంతేగాకుండా పిల్లల కోరికలను తీర్చనిచో జరిగే నష్టము నుండి కూడ మనము బయట పడవచ్చును. కాని వారు (అ) జమాఅత్ సభ్యులందరిని బాణాసంచాలు కాల్చుమని చెప్పలేదు. కాని పిల్లలు అప్పుడప్పుడు ఆడుకున్నచో అందులో ఎలాంటి అభ్యంతరము లేదు. వాతావరణము కూడ శుభ్రమవుతుంది అనే సంకల్పముతో కాల్చినచో పిల్లలు కూడ సంతోష పడుదురు, వాతవరణం కూడ పరిశుభ్రమగును ఇలా రెండు రకాల ప్రయోజనాలు చేకూరును. పిల్లలు గుర్తుంచు కోవలసిన విషయం ఏమిటనగా బాల్యములో ఆడుకునే ఆటా పాటల నుండి ఇస్లాం మిమ్ములను నిలవరించదు. ఉదా॥ కాంతులు ఏర్పాట్లు చేసుకొనుట, బాణా సంచాలు కాల్చుట. వీటి ద్వారా దేశం మొత్తము సంతోషాన్ని జరుపు కొంటున్నప్పుడు మనము కూడ ఆ సంతోషంలో పాలు పంచుకున్న వారలము అగుదుము. రెండవది దేశభక్తి కూడ బహిర్గతము అగును. మరియు పిల్లలకు కూడ సంతోషము చేకూరును. కావున సమయము, సందర్భమును అనుసరించి స్థోమతకు తగినట్లుగా వేడుకలు జరుపుకోవుటలో ఎలాంటి అభ్యంతరం లేదు. కాని పిల్లలకు మాత్రము బాల్యము నుండే మనము ఏ పని చేసినను అది ఇస్లాం మరియు దేశ చట్టాలకు అనుగుణంగానే ఉండునట్లు చేసుకోవలెనని తెలియజేయాలి.

హజ్రత్ ముస్లెహ్ మౌఊద్ (ర) తమ రెండు బాల్య సంఘటనలను గూర్చి ఇలా తెల్పిరి: నాకు ఎల్లప్పుడు ఇవి గుర్తుకుండును. నేను చిన్న వాడిని, హజ్రత్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలాం ఒకసారి ముల్తాన్‌కు వెళ్లిరి, నేను కూడ వారి వెంట యుంటిని. ఆ సమయంలో నాకు 7 లేదా 8 సంవత్సరాల వయస్సు ఉండవచ్చును. కాని నా రెండు సంవత్సారాల వయస్సులో జరిగిన కొన్ని సంఘటనలు కూడ నాకు గుర్తున్నాయి. అంతేగాకుండా నా మొదటి సంవత్సరములో జరిగిన ఒక సంఘటన కూడ ఒక మిత్రుడు గుర్తుచేయడం వలన నాకు గుర్తుకు వచ్చినది. నాకు బాల్యములోని అనేక సంఘటణలు గుర్తున్నాయి. కాని ఈ ప్రయాణమునకు చెందిన సంఘటణలు మాత్రము రెండే గుర్తున్నాయి. మొదటి విషయం ఏమనగా: తిరుగు ప్రయాణంలో హజ్రత్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలాం లాహోర్‌లో ఒకరోజు విడిది చేసిరి, ఆ సమయంలో అక్కడ మైనపు బొమ్మల ప్రదర్శన జరుగు చుండెను. వాటి ద్వారా చక్రవర్తుల మరియు వారి ఆస్థానంలో గల మంత్రుల చరిత్రను గూర్చి ఆ బొమ్మల ద్వారా తెలుపుచుంటిరి. షేక్ రహ్మతుల్లాహ్ గారు అవి విజ్ఞానంను వృద్ధి చేయు ప్రదర్శన అని, చరిత్రకు సంబంధించిన అనేక విషయాలు వాటి ద్వారా తెలియునని, కావున ఆ ప్రదర్శనను తిలకించుటకు వెళ్లినచో బాగుండునని హజ్రత్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలాంతో వేడుకొనిరి. కాని హజ్రత్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలాం అచటకు వెళ్ళుటకు నిరాకరించిరి. ఆ తరువాత వారు నా వద్దకు వచ్చి ఆ ప్రదర్శనను తిలకించుటకు నాపై ఒత్తిడి పెంచిరి. అందుకు నేను హజ్రత్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలాంను ఆ ప్రదర్శనకు తీసుకవెళ్ళమని పదే పదే విన్నవించుకోగా, వారు నా విన్నపంను చూసి నన్ను ఆ ప్రదర్శనకు తీసుకొని వెళ్ళిరి. చక్రవర్తుల స్థితిగతులను ఆ బొమ్మల ద్వారా చూపించడం జరిగినది. అందులో కొందరి మరణంను గూర్చి, మరి కొందరి ఆనారోగ్యమును గూర్చి చక్కటి ప్రదర్శననిచ్చిరి. ఇది మొదటి విషయం. హజ్రత్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలాం నన్ను ఆ ప్రదర్శనకు కేవలం అది ఒక విజ్ఞాన విషయమని. చరిత్రకు చెందిన అనేక విషయాలు అందులో గలవని, ఇతరులు కూడ ఆ ప్రదర్శనను కూడ పొగిడారని, అలాంటి వాటిని చూడటంలో తప్పేమి లేదని మాత్రమే తీసుకవెళ్ళారు. కేవలం పిల్లవాడి పట్టుదలను చూసి మాత్రమే తీసుక వెళ్ళలేదు. ఒకవేళ వారు ఇది ఇస్లాం బోధనలకు విరుద్ధమైన చర్య అని భావించినచో పిల్లవాడు ఎంత ఏడ్చినను ఆ ప్రదర్శనకు తీసుక వెళ్ళేవారు కాదు. అది కేవలం విజ్ఞానానికి సంబంధించిన విషయమే కావున వారు (అ) తన కుమారుడికి చూపించుటకు తీసుకవెళ్ళిరి.

హజ్రత్ ముస్లెహ్ మౌఊద్ (ర) తనకు గుర్తున్న రెండవ సంఘటణను గూర్చి కూడ ఇలా తెల్పిరి, లాహోర్‌లో హజ్రత్ మసీహ్

మౌవూద్ అలైహిస్సలాంను ఒకరు విందుకు ఆహ్వానించిరి. అందుకు వారు ఆ విందును స్వీకరించుటకు వెళ్ళిరి. నాకు గుర్తున్నంత వరకు అది విందుకు చెందిన ఆహ్వానం కాదు. ముఫ్తి ముహమ్మద్ సాధిఖ్ గారు లేదా వారి కుమారుడు అనారోగ్యముతో ఉండగా పరామర్శించుటకు వెళ్ళిరి. మొత్తమునకు వారు వారిని పరామర్శించుటకు వెళ్ళి, పట్టణము నుండి హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) బయటకు వచ్చుయుండగా బంగారపు మస్జిద్ మెట్ల వద్ద కొందరు ప్రోగై ఒకరిని మరొకరు దూషించుకోవడంను చూసిరి, వారి మధ్యలో ఒక వ్యక్తి నిలబడి యుండెను. చూడడానికి అతడు ఒక మౌల్వీ వలే కనిపించుచుండెను. లేదా మౌల్వీల గుణాలు కల్గి యున్నాడు. బహుశా తన వైపు నుండి అన వసరంగా ఇతరులతో చాలెంజ్ చేయుచున్నాడు. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం వాహనం ఆ సమూహం వద్ద నుండి వెళ్ళుచుండగా నేను ఆ సమూహమును చూసి బహుశా అది ఏదైన సంత కావచ్చునని భావించితిని. అందువలనే నేను కిటికి నుండి నా తల బయటకు తీసి చూడసాగితిని, ఒక వ్యక్తికి చేయి తెగి యున్నది, అతని చేతికి రెండు పసుపు గుడ్డలు కట్టి యున్నవి, అతడు తన ఒక చేతని మరో చేతిపై కొట్టుకొనుచు మిర్జా పారి పోయాడు, మిర్జా పారి పోయాడని అరుస్తున్నాడు.


ఈ సన్నివేశాన్నియే నేను గతంలో మరో విధముగా కూడ తెల్పినాను కాని ఇక్కడ చూడండి ఒక వ్యక్తికి గాయమైనప్పటికి, అతని రెండు చేతులకు పట్టీలు కట్టినప్పటికి కూడ అతడు వ్యతిరేకత భావపు ఉద్రేకం వలన తన శక్తిలేని చేతుల ద్వారానే అహ్మదియ్యత్‌ను అంత మొందించెదనని, అహ్మదియ్యత్‌ను పూడ్చివేయుదుననే భ్రమలో మునిగి యున్నాడు. (నవూజ్ బిల్లాహ్). వారి హృదయాలలో స్థిరపర్చుకొన్న ఈ శత్రుత్వం ఎంతటి ప్రమాదకరమైనదో ఒక్కసారి ఆలోచించండి. ప్రజలు ఖాదియాన్‌కు రాకూడదని, అహ్మదియ్యత్‌ను స్వీకరించకూడదని ఎంతగా ప్రయాత్నాలు చేసినారో ఒక్కసారి ఆలోచించండి. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం కాలంలో ఖాదియాన్‌కు చేరుకోవలెననే ఉద్దేశముతో బటాల వరకు వచ్చిన వారిని ముహమ్మద్ హుసేన్ బటాల్వి తిరిగి పంపించడంతో వెనుదిరిగి పోయనవారెందరో నేడు అహ్మదియ్యత్ లో ఉన్నారు. అందువలనే మౌల్వీ అబ్దుల్ మాజిద్ బాగాల్‌పూరి గారు ప్రారంభములోనే అహ్మదియ్యత్‌ను స్వీకరించలేక పోయినట్లు నేను విన్నాను. వారు బటాలకు చేరుకోగానే ముహమ్మద్ హుసేన్ బటాల్వి వారికి మాయ మాటలు చెప్పి వెనుకకు పంపించి వేసెను. ముహమ్మద్ హుసేన్ బటాల్వి ప్రతీసారి ఇదే పని చేసేవాడు. ప్రతి రోజు రైల్వే స్టేషన్‌కు చేరుకొని, ఎవరైన ఖాదియాన్‌కు వెళ్ళాలనే ఉద్దేశంతో బటాలకు చేరుకోగానే అక్కడికి వెళ్ళి ఏమి చేయుదురు?, అక్కడికి వెళ్ళినచో మీ విశ్వాసం చెడిపోవునని వారితో అనేవాడు. చాలా మంది అతనిని పండితుడని, అతడు చెప్పునవి వాస్తవమేనని భావించి వారు వెనుదిరిగేవారు. ఇదంతయు మౌల్వీల వ్యతిరేకత వలనే జరిగినది. వారు సామాన్య ప్రజానికాన్ని కూడ ఎంతగా తప్పు ద్రోవ పట్టించారనగా శక్తి సామర్ధ్యములు లేని వారు కూడా జమాఅత్‌కు వ్యతిరేకంగా నినాదించునట్లు చేసిరి. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాంకు వ్యతిరేకంగా ఉధ్భవించిన ఈ వ్యతిరేకతలో మౌల్వీల స్వార్ధం, మూర్ఖత్వం గలవు. వారు ధర్మము పేరుతో ప్రజలను రెచ్చగొడుతూ వారి లక్ష్యాన్ని పూరించుకున్నారు. వాస్తవానికి నేటి వరకు ఈ ఉలమాలు ఏ అంశంను వ్యతిరేకతకు ఆధారంగా చేసుకొని లేదా చేసుకొంటూ ప్రజలను రెచ్చగొడుచున్నారో, హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం వచ్చి ఆయా అంశాలను పూర్తి చేయడం కూడ జరిగినది. అనగా ఇస్లాం యొక్క సత్య బోధనలను ప్రపంచానికి చాటి చెప్పడం, ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం యొక్క ఖత్మే నబువ్వతును స్థాపించడం. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం హజ్రత్ ముహమ్మద్ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం యొక్క స్వచ్ఛమైన అభిమాని మరియు స్వచ్ఛమైన సేవకుడు. నేడు ప్రపంచపు విముక్తి కేవలం ఈ అంతిమ ప్రవక్త అయిన హజ్రత్ ముమమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లంగారి వలనే సాధ్యమని ప్రపంచ ప్రియులకు తెలియ జేయుటకు మాత్రమే అవతరించిరి. కాని ఈ పేరు గాంచిన పండితుల దురదృష్టం ఏమిటనగా ఆ ప్రవక్త అభిమానికి సహాయ సహకారాలు అందించుటకు బదులు, వారిపైనే ఇతడు ఖత్మె నబువ్వత్‌ను తిరస్కరించినాడని లేదా హజ్రత్ ముహమ్మద్ ప్రవక్త సల్లల్లాహు అలైహివసల్లం ప్రతిష్టకన్న తన ప్రతిష్ట ఎక్కువైనదని ప్రకటించుకున్నట్లు నవూజ్‌బిల్లాహ్ నిందలు వేయుచున్నారు. కాని హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం గారి ఆచరణలకు, బోధనలకు వ్యతిరేకులు వేసే నిందలకు ఏ మాత్రం పోలికలు లేవు. నేడు విముక్తి కేవలం ఇస్లాంను స్వీకరించుట వలనే మరియు హజ్రత్ ముహమ్మద్ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం యొక్క బానిసత్వంలోనే గలదని వారు అలైహిస్సలాం ప్రపంచపు సర్వ ధర్మముల వారికి చాలెంజ్ చేసినారు.

మొత్తానికి ఈ పండితులు వారి ప్రయత్నములో వారుండిరి, అయినను ఈ జమాఅత్ అభివృద్ది చెందుతూనే ఉన్నది. నేడు కూడ వీరు ప్రయాత్నాలు చేయుచూనే ఉన్నారు, ఇకపై కూడ ప్రయాత్నాలు చేయుదురు. కాని అల్లాహ్ తాలా లక్ష్యం మాత్రము హజ్రత్ ముహమ్మద్ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం యొక్క ప్రియమైన దాసుని జమాఅత్ అభివృద్ధి చెందవలెనని మాత్రమే గలదు, అందువల్లనే వృద్ధి చెందుచున్నది, ఇకపై కూడ చెందుతూ ఉండును. (ఇన్షా అల్లాహ్)

హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఆశించిన విధముగా అల్లాహ్ తాలా మనందరిలో పరివర్తన కలిగించును గాక! స్వఛ్ఛమైన ముసల్మానులకు ఉదాహరణగా మనలను నిలుపు గాక! మన ఆలోచనలలో, మన ఊహలలో క్రొత్త దనంను ప్రసాదించును గాక! మన హృదయాలలో కూడ దైవ భీతిని కల్గించును గాక! (ఆమీన్)

నేడు కూడ నమాజ్ అనంతరం ఒక పరోక్ష అంత్య క్రియ పార్ధనను చదువించెదను. ఈ నమాజ్ గౌ॥ డాక్టర్ అతావుర్రహ్మాన్ సాహీవాల్ ప్రాంతపు పూర్వ అధ్యక్షుల గారి శ్రీమతి గౌ॥ అమతుల్ హఫీజ్ రహ్మాన్ గారిది, వీరు 15 ఏప్రిల్ 2016న పరమపదించిరి. ఇన్నా లిల్లాహి వ ఇన్నా ఇలైహి రాజివూన్.

వీరు హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం గారి అనుచరులైన హజ్రత్ మియాం అజీముల్లాహ్ గారి కోడలు, మరియు హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం గారి మరో అనుచరులైన హజ్రత్ షేఖ్ హుసేన్ బక్ష్ గారి మనవరాలు. వీరి తండ్రి గారు గౌ॥ మలిక్ ముహమ్మద్ ఖుర్షీద్ గారు రబ్వా యొక్క ప్రారంభపు నిర్మాణ కమిటికి సెక్రటరిగా బాధ్యతలు నిర్వహించారు. క్రీ॥శే॥ వారు కూడ చాలా కాలం వరకు సాహీవాల్ మహిళ అధ్యక్షురాలుగా కూడ బాధ్యలు చేపట్టిరి. దేవునిపై చాలా నమ్మకం గల వారు, దు:ఆలు చేయువారు, ప్రార్ధనలలో అధిక సమయం గడిపేవారు, పేదవారికి సహాయ సహకారాలు అందించేవారు, అతిథి మర్యాదలు చేయువారు, ఖిలాఫత్ పట్ల చాలా విధేయతను చూపేవారు, సహనం, కృతజ్ఞతతో జీవితం కొనసాగించిన వారు. సాహేవాల్ లో అహ్మదీయులపై అక్రమ కేసులు పెట్టి వారిని జైలుకు పంపుచున్న తరుణంలో వీరి భర్త గారు అధ్యక్షులైనందున వారిని కలుసుకొనుటకు వచ్చిపోయే వారందరికి అతిథి మర్యాదలు చేసిరి. వీరి భర్త గారైన డాక్టర్ అతావుర్రహ్మాన్ సాహీవాల్ గారు సుమారు 40 సంవత్సరాల వరకు జమాఅత్‌కు సేవలు అందించిరి. ఆ సమయంలో వీరు చాలా ఉత్సాహంతో వీరి భర్త గారికి సహాయ సహకారములు అందించినారు. కేంద్రీయ పర్యాటకుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపేవారు. వీరి సంతానము మొత్తమునకు ఖిలాఫత్ పట్ల అభిమానం, ప్రేమ, విధేయత ఉండునట్లు శిక్షణను ఇచ్చిరి. అల్లాహ్ తాలా అనుగ్రహంతో వీరు వసియ్యత్‌లో భాగాస్వాములు, వీరికి 5గురు కుమారులు, 3గురు కుమార్తెలు. అల్లాహ్ తాలా వారందరికి సత్కార్యములను కొనసాగించుచు భాగ్యమును ప్రసాధించును గాక! రాబోవు తరాల వారిని కూడ ప్రయోజకులుగా తీర్చిదిద్దును గాక! (ఆమీన్)


ప్రొ॥ ముహమ్మద్ సలీమ్
9949356387
9949146660
Love for All Hatred for None

మస్రూర్ హోటల్
టీ, టిఫిన్, మీల్స్, చికెన్ బిర్యాని, ఫాస్టు ఫుడ్ లభించును.
నాయుడు పెట్రోల్ పంపు, ఖమ్మం రోడ్, వరంగల్, తెలంగాణ
**అన్ని కంపెనీల సెల్ రిచార్జ్‌లు చేయబడును.**

EDITOR
SYED RASOOL NIYAZ
SUB EDITOR: MOHAMMAD AKBAR
Mobile. :(+91) 9948692101
e-mail :badartel001@gmail.com
website:www.akhbarbadarqadian.in
:www.alislam.org

Title Code: PUNTEL00001
The Weekly **BADAR** Qadian
బదర్ వార పత్రిక ఖాదియాన్
Distt: Gurdaspur (Pb.) INDIA Qadian - 143516
Vol.1. Thursday 26 May 2016 Issue No.12

MANAGER
NAWAB AHMAD
Mobile. : (+91) 94170-20616
Tel : (+91)-1872-224757
e-mail :managerbadrqnd@gmail.com
ANNUAL SUBSCRIPTION:Rs.300/-

(రెండవ పేజి తరువాత)

కొంత కాలం పక్కకు పెట్టినను, దయామయురాలైన తల్లి తన బిడ్డ సంస్కరణకై కొంత సమయం వరకు కోపముతో దూరమైనట్లగును. ఇందులో కఠిన కోపముండదు. కాని బిడ్డకు తల్లితో గల ప్రేమ వల్ల ఆమె వద్దకు వెళ్లినపుడు ఆమె తన ఛాతికి హత్తుకొనును. అంతకు ముందు కూడ ఆ బిడ్డ తన వద్దకు వస్తున్నాడా లేదా అని చాటుగా చూచును. కాని బాలుడు దగ్గరకు రాగానే కోపము దూరమగును. తల్లుల కంటే అధికంగా క్షమించు అల్లాహ్ నా దాసులు పశ్చాత్తాపడుచు ఎప్పుడు నా వైపు వస్తారా అని చూచును. వచ్చిన తర్వాత క్షమించును. ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లు తెల్పినారు. అల్లాహ్ పై ప్రమాణము! జనావాసము లేని కూడలిలో తన ఒంటెను పోగొట్టుకున్న వ్యక్తికి అది లభించినప్పుడు కలిగే ఆనందము కంటే ఎక్కువ తన దాసుడు పశ్చత్తాప పడ్డప్పుడు అల్లాహ్‌కు ఆనందము కలుగును.

(సహీ బుఖారీ కితాబుద్దావాత్ బాబుత్తౌబతో - 6309)

ఈ రమజాన్ మాసము ఎందుకనగా! దాసుడు అల్లాహ్ తాలా ప్రేమను హృదయములో కలిగి ఉండి, సంవత్సరమంతా లోపాలకు, పొరపాట్లకు పాల్పడినను అతని పశ్చత్తాపమును అల్లాహ్ తాలా స్వీకరించ వలెనను ఉద్దేశ్యముతో వచ్చినచో అల్లాహ్ తాలా పరుగెత్తి అతన్ని హత్తుకొనును. ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లు తెల్పినారు. ఎవరైన నాకు జానెడు సమీపమైనప్పుడు నేను గజము సమీపమవుతాను. అతడు నాకు ఒక చెయ్యి సమీపమైనప్పుడు నేను రెండు చేతులు సమీపమవుతాను. అతడు నా వైపు నడిచి వచ్చినచో అతని వైపు నేను పరుగెత్తుకు వస్తాను.

(సహీ బుఖారీ కితాబుత్తౌహీద్ బాబ్ ఖౌలుల్లాహి తాలా వ యుహ జరుకుముల్లాహ నఫ్సహూ - హదీసు - నెం॥ 7405)

కావున తల్లుల కంటే గొప్ప దయామయుడైన అల్లాహ్ తాలా, పశ్చత్తాపమును స్వీకరించుటకు, తన దాసునితో ఆనందాన్ని పొందేందుకు అనేక మార్గాలను సృష్టించాడు. దాసుడు వీటిలో లబ్ధి పొందనిచో అది వాని దురదృష్టము, అతని కఠిన మనస్తత్వము అగును. అల్లాహ్ తాలా ప్రేమను ఈ ఉదాహరణలతో పోల్చబడినను వాస్తవానికి అల్లాహ్ తాలా ప్రేమ స్వరూపము ఈ ఉదాహరణల కంటే చాలా గొప్పది. అల్లాహ్ తాలా ఎంతటి ప్రేమానురాగముతో దాసుని వైపు చూచునో దానిని మనము వర్ణించలేము. ఇది హదీసులతోను స్పష్టమైయింది. ప్రేమను గూర్చి ఈ ఉదాహరణ ఇవ్వబడినను వాస్తవానికి ఇది ప్రేమ యొక్క ఘనతను చాటి చెప్పును. అయినను అల్లాహ్ తాలా ప్రేమ ఉదాహరణ ఈ ప్రాపంచిక ఉదాహరణల కంటే చాలా ఉన్నతమైనది. దానిని వర్ణించుట చాలా కష్టము మానవుడు నిస్సహాయుడు, అల్పజ్ఞాని. అల్లాహ్ తాలా అత్యున్నతుడు మనము తమ వంటి దాసుల హృదయాలను కూడ ఎరుగము మనము బాహ్య ఆచరణను చూసే ఒక అభిప్రాయానికి వస్తాము కాని ఎవరి హృదయములో ఎవరి పట్ల ఎంత ప్రేమాభిమానం కలదో వర్ణించుట, తెలుసుకొనుట చాలా కష్టము.

అల్లాహ్ తాలా ప్రేమ స్థాయిని అర్థం చేసుకొను శక్తి మానవునిలో ఎంత ఉంటుందని వివరిస్తు హజ్రత్ ముస్లిహ్ మౌవూద్ రజియల్లాహు అన్హు ఇట్లు తెలిపిరి. అల్లాహ్ తాలా కార్యములనే అర్థము చేసుకోలేని మనము ఆయన ప్రేమ స్థాయిని, భౌతిక విషయాలను ఎలా అర్థం చేసుకోగలం? నేను తెల్పినట్లు ఆయన ప్రేమ స్థాయిని పరిమితం చేయుట చాలా కష్టము. అయినను కొన్ని ఉదాహరణల ద్వారా దాని వివరణకు సమీపంగా చేరుటకు కృషి జరుగును.

ఈ ప్రేమను గూర్చి ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ప్రవచించిన మరో ఉదాహరణ నేను ప్రవేశ పెట్టెదను. బదర్ యుద్ధములో శత్రువు ఓటమి చెందినప్పుడు సుమారు యుద్ధము ముగిసిపోయెను. ఆ గొప్ప గొప్ప వీర సైనికులు తమ గుర్రాలపై కూర్చుని వాటిని కొరడాలతో కొట్టుచు యుద్ధ భూమి నుండి పారిపోవుటకు, ముస్లిం సైన్యము నుండి తప్పించుకొనుటకు ప్రయత్నించుచుండిరి. అప్పుడు ఒక మహిళ భీకర యుద్ధ భూమిలో నిర్భయంగా తిరుగుచుండెను. ఆమె తనలో ఒక ఉద్రేకము, ఆవేదనను కలిగి యుండెను. ఒక సారి ఒక బాలున్ని ఎత్తుకొనగా, మరోసారి మరో బాలున్ని ఎత్తుకొనుచుండెను ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఆ మహిళను చూసి ఆమె కొడుకు తప్పిపోయినాడు. ఆమె అతన్ని వెతుకుతున్నదని అన్నారు. తల్లి ప్రేమ వల్ల ఇది యుద్ధ భూమి, ఇక్కడ అల్లకల్లోలము ఏర్పడిందనే భయము అమెకు లేదు. ఆ మహిళ అదే విధంగా మైమరచి తిరుగుతూ ఏ బాలున్ని చూచినా తన ఛాతికి హత్తుకొనుచుండెను. కాని గమనించి చూచి తన బాలుడు కాదని తెలిసినప్పుడు విడిచి పెట్టేది. చివరకు ఆమె బాలుడు ఆమెకు లభించినాడు. అతనిని ఛాతికి హత్తుకుంది, గట్టిగా పట్టుకొని ముద్దాడి అక్కడే నిర్భయంగా కూర్చొనెను. ఇది యుద్ధ భూమి అన్న చింత, ఇక్కడ ప్రతి చోట శవాలు పడి యున్నాయన్న భావన మరియు యుద్ధము ఇంకా పూర్తి కాలేదు, తనకు ఏదైనా ఇబ్బంది కలుగ వచ్చుననే చింతన ఆమెకు లేకుండెను. కాని అంతకు ముందు బాలున్ని వెతుకుచు ఎంత కలత, ఆందోళన, బాధ వ్యక్తపరచుచుండెను. కాని తన బాలుడు దొరకగానే సంతృప్తితో కూర్చుండి పోయిందని ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం తెలిపినారు. అలాగే తన దాసులతోనూ అల్లాహ్ తాలా ప్రేమ కూడ ఇలాగే ఉంటుందని ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం తెలిపినారు. వాస్తవానికి అతడు అంతకంటే ఎక్కువగా ప్రేమించును. ఒక దాసుడు తన పాపముల, తప్పిదముల వల్ల అల్లాహ్ తాలాను కోల్పోయినప్పుడు తన బాలున్ని కోల్పోయిన ఆ మహిళ వలె దుఃఖము కలుగును. అనంతరం తన దాసుడు పశ్చత్తాప పడి తిరిగి వచ్చినప్పుడు తన బాలుడు దొరకనప్పుడు ఆ మహిళకు కలిగిన ఆనందము కంటే ఎక్కువ ఆనందపడును. మనము కూడ అల్లాహ్ తాలా క్షమాపణ పొందేందుకు సిద్ధమై అతని వద్దకు వెళ్లినప్పుడు అతడు కూడ మనల్ని క్షమించుటకు సిద్ధంగా ఉంటాడు. మనము అతని వద్దకు ఎప్పుడు వస్తామని చూస్తున్నాడు. మనము ఆలస్యం చేస్తున్నాము. ఎవరైతే పశ్చాత్తాప పడుతూ అల్లాహ్ తాలా ఆస్థానానికి వెళ్ళునో తన పాపములకు క్షమాపణ కోరుకొనునో అల్లాహ్ తాలా క్షమాగుణం అతన్ని క్షమిస్తుంది.

ఇదే అంశాన్ని గూర్చి హజ్రత్ ముస్లిహ్ మౌవూద్ రజియల్లాహు అన్హు మరో ముఖ్య విషయాన్ని తెల్పినారు అల్లాహ్ క్షమాపణ మానవుని పాపములను కప్పిపుచ్చుటయే కాక ఆయా పాపము స్వయంగా మర్చిపోయి ఇతరులను కూడ మరిపింపచేస్తుంది. అందు చేతనే అల్లాహ్ నామము సాతిర్ కాకుండా సత్తార్ అయినది. సర్వాన్ని కప్పివుంచు దానినే సత్తార్ అంటారు. ప్రపంచం కేవలం సాతిర్ మాత్రమే కాగలదు అనగా ఎవరిదైన ఏదైన తప్పు తెలిసినచో దానిని ఇతరులకు చెప్పక దాచి పెట్టును. కాని ఇతరుల మేధస్సు నుండి తమరి తప్పులను తొలగించ లేరు కాని సర్వ గుణముల సముదాయుడైన అల్లాహ్ తాలా నేను సాతిర్‌ను కాను సత్తార్‌ను అని తెలిపినాడు. అనగా కేవలం దాసుల పాపాలను క్షమించుటయే కాదు వాటిని ప్రజల జ్ఞాపిక నుండి తొలగిస్తాను. తద్వారా ఎవరు, ఏ తప్పు చేసినారో వారికి గుర్తుండదు. అల్లాహ్ తాలా సత్తార్ (క్షమాగుణ ప్రపూర్ణుడు) కానిచో పాపాత్ములకు స్వర్గములోను శాంతి లభించేది కాదు. ఎందుకనగా వారు ఎవరిని చూసిన వీరికి నా తప్పులు తెలుసునని అనుకునేవారు.

అల్లాహ్ తాలా సత్తార్ అయియున్నాడు. అతడిట్లు తెల్పినాడు. నేను ప్రజల తప్పులను క్షమించుటయే కాక వారి జ్ఞప్తి నుండి వాటిని మరిపించు శక్తి కలవాడను. అల్లాహ్ తాలా ఎవరి తప్పులనైతే క్షమించునో వారి తప్పులను ఇతరులతో మరిపింప చేయును. కావున అటు వంటి వారిని ప్రజలు ఎల్లప్పుడు పవిత్రునిగా, సత్పురుషునిగానే భావిస్తారు. మన అల్లాహ్ తప్పులను కప్పి ఉంచి, పాపాలను క్షమించువాడు. అతడు మనలను క్షమించుటయే కాక మనము కోల్పోయిన గౌరవాన్ని కూడ మరల ఇప్పించ గలడు ప్రాపంచిక గౌరవాన్ని నిలుపును.

(మాఖూజ్ అజ్ ఖుత్బాతె మహ్మూద్ సంపుటి 18 పేజీలు 513 నుండి 515 వరకు)

(సశేషం)

Printed & Published by: Jameel Ahmed Nasir on behalf of Nigran Board of Badar, at Fazle-Umar Printing Press Qadian, Harchowal Road, Qadian
Distt: Gurdaspur-143516, Punjab, India. And published at office of the Weekly Badar Moh-Ahmadiyya, Harchowal Road P.o:Qadian Distt:Gsp-143516, Punjab.India.Editor: Syed Rasool Niyaz